సాక్షి
ప్రకాశం
గురువారం | 6 ఏప్రిల్ | 2023





**జగనన్నే మా భవిష్యత్తును విజయవంతం చేయండి**

జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ వాల్‌పోస్టర్లను బాలినేని, ఆదిమూలపు ఆవిష్కరించారు.

- 5లో..



**దళితుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

దళితుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

- 5లో..

గరిష్టం/కనిష్టం
34 /27

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

జిల్లా సర్వజన ఆస్పత్రిలో పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రిమ్స్‌ను అభివృద్ధి చేశారు. కోట్లు వెచ్చించి అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. వైద్య సేవల కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే పేదలకు జీజీహెచ్ ఊపిరి పోస్తోంది.



# పెద్దాసుపత్రిలో సేవలు సూపర్

**రిమ్స్‌లో సేవలు ఇలా (ఒక్క నెలలో)**

ఓపీలు: **30** వేలు | ఇన్ పేషంట్లు: **3500**

వివిధ రకాల ఆపరేషన్లు: **400** పైగా

దయాలసిస్ సేవలు **1000**కి పైగా | కాన్పులు **1000**

- రిమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు
- బాలినేని, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షణ
- సాధారణ విభాగంలో 12, సూపర్ స్పెషాలిటీలో 7 రకాల వైద్య సేవలు
- అందుబాటులో ఐసీయూ బెడ్స్
- లేబొరేటరీ, రేడియాలజీ విభాగంలో వేలాదిగా పరీక్షలు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** జిల్లా కేంద్రంలో ఉన్న పెద్దాసుపత్రి (జీజీహెచ్) పేదలకు అత్యాధునిక వైద్యసేవలందిస్తోంది. జిల్లా నలుమూలల నుంచి రోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. అలాగే అత్యవసర సేవల నిమిత్తం పొరుగు జిల్లాల నుంచి కూడా ఇక్కడకు వస్తారు. ఎంతో కీలకంగా ఉన్న ఈ ఆస్పత్రికి రూ.కోట్లు వెచ్చించి అత్యాధునిక హంగులు కల్పించారు. అలాగే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. రిమ్స్‌లో నెలకు సుమారు 30 వేల వరకు ఓపీ (అవుట్ పేషెంట్స్), 3500 పైగా ఐపీ (ఇన్ పేషెంట్లకు) వైద్య సేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, మానసిక వ్యాధులు, రేడియాలజీ, స్త్రీ వ్యాధులు, ప్రసూతి, చర్మవ్యాధులు, చిన్న పిల్లల విభాగం, దంత వైద్యం, ఈఎన్‌టీ, కంటి వైద్యం, ఊపిరితిత్తులు, శ్వాస కోశవ్యాధులు ఇలా 12 రకాల సాధారణ వైద్యసేవలు అందుతున్నాయి. అలాగే సూపర్ స్పెషాలిటీ విభాగంలో ప్లాస్టిక్ సర్జరీ ఓపీ కన్సల్టేషన్‌తో పాటు ఐపీ సర్వీసెస్, శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. పీడియాట్రిక్ సర్జరీ, న్యూరో సర్జరీ, ఎమర్జెన్సీ ట్రామాకేర్, నెఫ్రాలజీ, యూరాలజీ, గుండె వ్యాధుల విభాగాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. జీజీహెచ్‌లో నెలకు సుమారు 400కు పైగా శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. కాన్పులు 800 నుంచి 1000 వరకు చేస్తున్నారు.

**ఫుల్‌గా రక్త, ఆక్సిజన్ నిల్వలు:**

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగుల కోసం ఏర్పాటు చేసిన రక్త నిధి కేంద్రంలో హోల్ బ్లడ్ 300 యూనిట్‌లు, ప్యాక్‌డ్ ఆర్‌బీసీ 100 యూనిట్‌లు, ప్లేట్‌లెట్స్ 48 యూనిట్లు నిల్వ చేసే సామర్థ్యంతో బ్లడ్‌బ్యాంకును ఏర్పాటు చేశారు. ప్రతి నెలా 4 నుంచి 6 బ్లడ్ క్యాంప్‌లు నిర్వహిస్తూ రక్త సేకరణ చేస్తున్నారు. దీని నుంచి అత్యవసరమైన రోగులకు బయటకు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. జీజీహెచ్‌లో 10 కేఎల్ సామర్థ్యం ఉన్న 3 ఎల్‌ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) ట్యాంకులు, 2 పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్‌లు (జగనన్న ప్రాణవాయువుతో పాటు మరొక ప్లాంట్) ఉన్నాయి.

**అందుబాటులో వందల పడకలు:**

ఈ ఆస్పత్రిలో 500 సాధారణ బెడ్లతో పాటు 100 ఐసీయూ బెడ్లు, 35 మెడికల్ ఐసీయూ, 10 సీసీయూ, 10 ఆర్ఐసీయూ, 25 సర్జికల్ ఐసీయూ, 20 పీడియాట్రిక్ ఐసీయూ బెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఏపీఎంఐఎస్‌డీసీ ద్వారా దాదాపు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచారు. అత్యవసర మందులు కొనుగోలు చేసేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను సైతం కేటాయించారు.

**వైద్య పరీక్షలు వేలల్లో...**

లేబొరేటరీ (రక్త నమూనా, మూత్ర పరీక్షల)కు సంబంధించిన పరీక్షలను జీజీహెచ్ సెంట్రల్ ల్యాబ్‌లో చేస్తున్నారు. అంతేకాకుండా థైరాయిడ్, డెంగీ, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్ఐవీ, బయాప్సీ వంటి పరీక్షలు చేస్తున్నారు. నెలకు సుమారు 75 వేల నుంచి 78 వేల పరీక్షలు చేస్తున్నారు. రేడియాలజీ విభాగం ద్వారా ఎక్స్‌రే (నెలకు 6వేలు), అల్ట్రా సోనోగ్రఫీ (నెలకు సుమారు 3వేలు), సీటీ స్కాన్ (నెలకు సుమారు 1000), ఎంఆర్ఐ (నెలకు సుమారు 250 నుంచి 350 వరకు) చేస్తున్నారు. డయాలసిస్ విభాగంలో నెలకు సుమారు 1000 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో 979, ఫిబ్రవరిలో 888 మందికి డయాలసిస్ చేశారు.

**ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా చర్యలు**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా పక్కా చర్యలు చేపట్టాం. జీజీహెచ్‌లో సాధారణ వైద్య సేవలతో పాటు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఏదో ఒక సూపర్ స్పెషాలిటీ వైద్యంలో జీజీహెచ్‌కు ప్రత్యేకత వచ్చేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

**ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం**


జీజీహెచ్‌లో సేవలు సూపర్. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. నిత్యం ఓపీ సేవలను పర్యవేక్షిస్తూ రోగులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నాం. సాధారణ వైద్య సేవలు అందిస్తూనే ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్లాస్టిక్ సర్జరీలను ప్రారంభించి విజయవంతంగా చేస్తున్నాం. ఔషధాలు దాదాపుగా అన్నీ అందుబాటులో ఉంచుతున్నాం. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించి పక్కాగా అమలు చేస్తున్నాం.

– భగవాన్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

చాకిచర్లలో 2 జిల్లాల స్థాయి

## కబడ్డీ పోటీలు

**ఉలవపాడు:** ఈ నెల 11 నుంచి మండల పరిధిలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్‌లో పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు తెలిపారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జరుగు ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీఫీజు రూ.500 గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రోకబడ్డీ నిబంధనలతో పోటీలు జరుగుతాయన్నారు. 9 వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9618884830, 9989759605 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.




## నేడు ఏకేయూ ఇంటర్ స్కూల్ పెడగాగీ గేమ్స్ మీట్

**ఒంగోలు:** ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో గురువారం నాలుగో ఇంటర్ స్కూల్ పెడగాగీ గేమ్స్ మీట్ –2023ను నిర్వహిస్తున్నట్లు ఏకేయూ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ తెలిపారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంపీడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా 21 రోజులపాటు ఒంగోలు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ ఆటల్లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా యూనివర్శిటీ వీసీ మూరెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజామోహన్‌రావు తదితరులు హాజరై ప్రసంగిస్తారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు వ్యక్తిగత బహుమతులు, మెమెంటోలు అందిస్తామని ప్రకటించారు.



# రామతీర్థంలో గంగమ్మ తిరునాళ్ల వైభవం



రామతీర్థంలోని గంగమ్మ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు



ప్రభపై ఆటపాటలతో అలరిస్తున్న యువతులు

- నిధిలో 13 విద్యుత్ ప్రభలతో ప్రత్యేక ఆకర్షణ
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు

**చీమకుర్తి:** ప్రసిద్ధి చెందిన రామతీర్థం గంగమ్మ తిరునాళ్ల బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. చీమకుర్తి, చుట్టుపక్కల గ్రామాలు, మండలాలతో పాటు జిల్లాలోని పలు సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రామతీర్థం తిరునాళ్లను తిలకించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో ఆలయ కమిటీ సిబ్బంది సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే రామతీర్థంలోని మోక్ష రామలింగేశ్వరస్వామి, గంగమ్మ తల్లి ఆలయాలను భక్తులు సందర్శించి పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. దానిలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారితో పాటు బూచేపల్లి కుటుంబ సభ్యులు రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరస్వామి, గంగమ్మలకు పూజలు చేసి స్వామివారు, అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించారు. చీమకుర్తి, ఆర్.ఎల్.పురం గ్రామాల నుంచి 13 విద్యుత్ ప్రభలను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఆధ్వర్యంలో నిర్మించారు. విద్యుత్ ప్రభలు చూపరులను ఆకట్టుకున్నాయి. చీమకుర్తిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన విద్యుత్ ప్రభపైకి స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరయ్యారు. ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వేలాదిగా తరలి వస్తున్న భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

# జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

- నివాళులర్పించిన ఆదిమూలపు సురేష్, బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్



బాబు జగ్జీవన్ రామ్ జయంతి మహోత్సవంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్, బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు:** బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు ఘన నివాళులర్పించారు. ముందుగా స్థానిక నెల్లూరు బస్టాండు, ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎన్.లక్ష్మానాయక్, వివిధ దళిత సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ వంటి మహనీయుల త్యాగాలను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 1978లో జగ్జీవన్‌రామ్ ఒంగోలు వచ్చినప్పుడు ఆయనను తాను తొలిసారి కలిశానని, ఇప్పటికీ ఆ మధుర స్మృతులు తనకు జీవితాంతం వెన్నంటి ఉంటాయన్నారు. ఏ అవసరం వచ్చినా వ్యక్తిగతంగా తాను కూడా దళితులకు అండగా నిలుస్తానన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ని స్ఫూర్తిగా తీసుకునే విద్యార్థులు సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదిగేలా కాఫీ విత్ కలెక్టర్, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోను ప్రత్యేక స్పందన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లు కల్పించిన రిజర్వేషన్లు, చట్టాల రూపకల్పన వల్లే చట్టసభల్లో తనవంటి మహిళలు రాజకీయాల్లో రాణించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బ్రహ్మయ్య మాదిగ, ఆనంద్, చప్పిడి వెంగళరావు, సృజన్, పాలడుగు రమేష్, బొంతా ఏసుదాసు, జె.ఆంజనేయులు, కత్తి కళ్యాణ్, చంద్రబోస్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు రమణమ్మ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, రాష్ట్ర టైలర్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్‌పర్సన్ షేక్ సుభాన్‌బీ, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, జిల్లా మైనార్టీ సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ అధికారి జి.అర్చన, కమిషనర్ యం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు వరికూటి కోటమ్మ పెద్దకర్మ

టంగుటూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్, రాష్ట్ర నాయకుడు వరికూటి అమృతపాణి మాతృమూర్తి వరికూటి కోటమ్మ పెద్ద కర్మ గురువారం ఉదయం 10 గంటలకు కారుమంచిలో జరగనుంది. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నేతలు హాజరు కానున్నారు.

### కారు, ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రాలర్ లారీ

- ప్రమాదంలో ఒకరు దుర్మరణం



ప్రమాదానికి గురైన ట్రాక్టరు, ట్రక్

సింగరాయకొండ: మరమ్మతులకు గురై నిలిచిపోయిన ట్రక్‌ను ఇనుప చైనుతో ట్రాక్టరుకు కట్టి లాక్కుని వెళ్తుండగా వెనుకే వస్తున్న ట్రాలర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ సూదనగుంట సురేష్(48) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట ఫ్లయ్ ఓవర్‌పై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన చింతా రాంబాబు, క్లీనర్ చింతా గోపిరాజు నెల్లూరు మార్కెట్‌కు చేపలు తీసుకెళ్లి అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో రాత్రి వేళ సుమారు 3 గంటల సమయంలో కె బిట్రగుంట ఫ్లయ్‌ఓవర్ వద్దకు రాగానే వారి ట్రక్ మొరాయించింది. దీంతో ఒంగోలు నగరంలోని కమ్మపాలేనికి చెందిన సూదనగుంట సురేష్‌తో మాట్లాడి మెకానిక్ షెడ్డుకు తీసుకెళ్లేందుకు ట్రాక్టరును రప్పించారు. ట్రాక్టరుతో ట్రక్‌ను కొంత దూరం లాక్కెళ్లిన తర్వాత వెనుక నుంచి అతివేగంగా వెళ్తున్న ట్రాలర్ లారీ ఢీకొట్టింది. ముందు ఉన్న ట్రాక్టరును ట్రక్ బలంగా తగలడంతో డ్రైవర్ సురేష్ అదుపుతప్పి రోడ్డుపై పడి పోయాడు. ఈ క్రమంలో ట్రక్ టైర్లు సురేష్ పైకి ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. ట్రక్ డ్రైవర్ చింత రాంబాబుకు స్వల్ప, క్లీనర్ చింత గోపిరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ముగ్గురినీ హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందగా, గోపిరాజు పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఫ్లయ్‌ఓవర్‌పై వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో భారీ క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర రావు వివరించారు.



తీవ్రంగా గాయపడిన సురేష్

# విధివంచితులపై వాత్సల్యం!

- 18 ఏళ్లలోపు చిన్నారులు 'మిషన్ వాత్సల్య'కు అర్హులు
- నెలకు రూ..4 వేలు చొప్పున సహాయం
- సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



పుల్లలచెరువులో సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

పొదిలి రూరల్/పుల్లలచెరువు: నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'మిషన్ వాత్సల్య' పథకం విధివంచితులకు అండగా నిలుస్తోంది. అభాగ్యుల విద్య, వైద్య అవసరాలు తీర్చేందుకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్యకు శ్రీకారం చుట్టాయి. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు వెచ్చిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వాటాగా ఒక్కొక్కరికి రూ.2400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.1600 ఇస్తోంది.

**అర్హులు వీరే..**

జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి దండ్రులకు దూరమైన వారు, పాక్షిక అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసినవారు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం–2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాలయాచకులు, బాల్య వివాహ బాధితులు, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకానికి అర్హులు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

**కొనసాగుతున్న సర్వే**

గత ఏడాదికి సంబంధించి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 218 మంది పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున 7 నెలల కాలానికి రూ.61.04 లక్షలు వారి సంరక్షకుల ఖాతాల్లో జమ చేశారు. గత ఏడాది పథకం ద్వారా లబ్ధి పొందలేకపోయినవారు, కొత్తవారి వివరాలు సేకరించేందుకు ప్రస్తుతం అన్ని మండలాల్లో ఐసీడీఎస్ సీడీపీఓలకు బాధ్యతలు అప్పగించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ఈ సర్వే జరుగుతోంది. జిల్లా కలెక్టర్ చైర్‌పర్స్‌న్‌గా ఉన్న కమిటీ పర్యవేక్షణలో అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

**వార్షిక ఆదాయంపై పరిమితి**

కుటుంబ సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు గల బాలల విషయంలో మినహా, పాఠశాలలకు వెళ్లేవారి హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా తాత్కాలికంగా నిలిపివేస్తారు.

**దరఖాస్తుల పరిశీలన ఇలా..**

సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులు అన్నింటినీ మండల స్థాయి స్క్రూటీ్నీ కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సభ్యులుగా ఉంటారు. వీరందరు సమావేశమై దరఖాస్తులను నిశితంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులు సంతకం చేసిన తర్వాత సదరు మీటింగ్ మినిట్స్‌తో పాటు దరఖాస్తులను జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయానికి పంపుతారు.

**దరఖాస్తుకు జత చేయవలసిన పత్రాలు**

- బాలుడు లేదా బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- చిన్నారుల ఆధార్‌కార్డు
- తల్లి అధార్ కార్డు
- తండ్రి ఆధార్‌కార్డు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికేటు, మరణ కారణం
- గార్డియన్ ఆధార్ కార్డు
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు లేదా బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బ్యాంకు అకౌంట్ వివరాలు బాలుడు లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్, లేక తల్లి, తండ్రి, సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్

**సీడీపీఓలకు ఆదేశాలిచ్చాం**



మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేశాం. వారి నుంచి వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులను కలిసి దరఖాస్తు ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. – వై.ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

### జగనన్నే మా భవిష్యత్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్ వాల్ పోస్టర్లను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆవిష్కరించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆదర్శంతోనే పాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- వైపాలెంలో జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత ఉద్ధారకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లను ఆదర్శంగా తీసుకొని పాలనను సాగిస్తున్నారని, వారిద్దరిని సీఎం రెండు కళ్లుగా భావించి అణగారిన వర్గాలకు ఎనలేని సేవలు అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. భారత తొలి ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక కొలుకుల సెంటర్‌లో మంత్రి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సాంఘిక దురాచారాలు, అసమానతలను తొలగించేందుకు జగ్జీవన్‌రామ్ సంస్కరణలు దేశానికి ఎంతో మేలు చేశాయని, ఆయన చేపట్టిన కేంద్ర శాఖ పదవులకు వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. దళితులు సాంఘిక, రాజకీయ, విద్య పరంగా ఎదగలేకపోతున్నారని, వారి అభ్యున్నతికి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ తీసుకొచ్చిన సంస్కరణలను అమలు చేయడంలో జగ్జీవన్‌రామ్ ప్రధాన పాత్ర పోషించారన్నారు. గత పాలకులు దళితులను ఓటు బ్యాంకుగా వాడుకోవడంతోపాటు నీచంగా ప్రవర్తించారని మంత్రి విమర్శించారు. దళితులుగా పుట్టాలని ఎవరు అనుకుంటారని అన్న చంద్రబాబు పాలనలో దళితులు హేయమైన బతుకులు వెళ్లదీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సుదూర పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బాధలు తెలుసుకున్న జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను పెద్ద ఎత్తున ప్రవేశపెట్టి అమలు పరిచారన్నారు. దళిత అక్కాచెల్లెమ్మలకు రూ.50 వేల కోట్ల నగదును బదలీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, నవరత్నాలు పథకాల్లో 50 శాతం బడుగు వర్గాలకు అందేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. విజయవాడలోని 18 ఎకరాల ఖరీదైన స్వరాజ్ మైదానంలో గత టీడీపీ పాలకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నారని, అటువంటి మైదానంలో రూ.300 కోట్లతో 125 అడుగుల ఎత్తు బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. గతంలో దేవాలయాల్లో అడుగు పెట్టలేని దళితులకు దేవస్థానం కమిటీల్లో స్థానం కల్పించి దళిత పక్షపాతిగా జగనన్న నిలిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా సహాయ, సహకారాలను అందిపుచ్చుకోవాలంటే మాల, మాదిగ అనే తేడా లేకుండా ఉపకులాలను కలుపుకొని ఐక్యంగా ఉండాలని కోరారు. సభకు జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కో ఆప్షన్ సభ్యుడు విజయకుమార్, సీపీఐ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, వివిధ దళిత సంఘాల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శం



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాల అమల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని బల్లిపల్లి సచివాయంలోని అడ్డరోడ్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో కూడా ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి అనేక పథకాలను అమలు చేశారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీదేనన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ గడప గడపకు తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి బుక్ లెట్‌ను అందచేశారు. తొలుత గంగసాని రామసుబ్బారెడ్డి, కె.మోహన్‌రావు, సర్పంచ్ ధనలక్ష్మీ, ఉప సర్పంచ్ లక్ష్మీరెడ్డి, స్థానిక నాయకులు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, బాపతు నారాయణరెడ్డి, నాగిరెడ్డి, మల్లెల యాకోబు, మాజీ ఎంపీటీసీ బాల మాలకొండారెడ్డి, ఎంపీటీసీ దేవసాయం, గోపాల్‌రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, శ్రీహరిరెడ్డి, మాలీ యాదవ్, గజ్జల కోటిరెడ్డి, బాపతు పెద్దిరెడ్డి, చిన్నయ్య, బాల అంకయ్య, ఏసు పాల్గొన్నారు.

# తమ్ముడే సూత్రధారి?

- ఆస్తి కోసం ఘాతకం
- పోలీసుల అదుపులో నిందితులు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం



ఘటనా స్థలంలో ఉన్న కత్తి వాసన పడుతున్న జాగిలం

కనిగిరి రూరల్: పట్టణంలోని కాశినాయన గుడి వీధిలో వి.సుశీల(42) అనే మహిళ మంగళవారం దారుణహత్యకు గురైన సంగతి విదితమే. అయితే ఈ హత్య చేసింది విజయవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తులు కాగా, చేయించింది మృతురాలి తమ్ముడిగా ప్రచారం జరుగుతోంది. మృతురాలి తమ్ముడు శ్రీను దుబార, ఇతరత్రా వ్యవహారాలతో ఉన్న ఆస్తిని పోగొట్టుకుని అప్పుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో ఒంటరి అయిన అక్క ఆస్తిపై కన్ను వేశాడు. కొద్ది కాలంగా ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఎలాగైనా అక్క ఆస్తిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో పథకం పన్నాడు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ఓ మహిళ ద్వారా విజయవాడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడిని పరిచయం చేసుకుని సుశీలను హత్య చేసేందుకు రూ.2 లక్షల సుపారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. పథకంలో భాగంగా విజయవాడకు చెందిన యువకుడు.. అదే ప్రాంతానికి చెందిన మరొకరిని సాయంగా తెచ్చుకొని సుశీలను హత్య చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఒంటరిగా ఉంటున్న సుశీల వద్దకు వెళ్లి ఇంటి పై పోర్షన్ అద్దెకు కావాలని పైకి తీసుకెళ్లి దారుణంగా గొంతు కోసి హత్య చేసినట్లు తెలుస్తోంది.

**పోలీసుల అదుపులో నిందితులు..?**

మంగళవారం రాత్రి ఘటనా స్థలిని వెంటనే పరిశీలించిన పోలీసులు నూతన సాంకేతిక విధానంతో తక్షణం నిందితులను గుర్తించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బుధవారం కనిగిరికి వచ్చిన డాగ్ స్క్వాడ్ జాగిలం కూడా మృతురాలి తమ్ముడు నివాస ప్రాంతం ఏరియాలో, నాగులచెరువు ప్రాంతంలో, ఏటీఎం వద్ద తిరిగింది. ఘటన స్థలిని క్లూస్ టీం బృందం పరిశీలించింది. ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత స్వర్ణ మహావీర్, సిఐ రామకృష్ణారెడ్డిలు ఘటన ప్రదేశాన్ని పరిశీలించి, సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

## అశ్రునయనాల మధ్య మోహన్‌బాబు అంత్యక్రియలు

- తలకొరివి పెట్టిన మనుమడు
- హాజరైన సురేష్‌బాబు, వెంకటేష్, రాణా, నాగచైతన్య, అభిరామ్
- వేలాదిగా తరలి వచ్చిన అభిమానులు



మోహన్‌బాబు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న వెంకటేష్, రానా, నాగచైతన్య, అభిరాం

కారంచేడు: మూవీ మోఘల్, బాపట్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడు సోదరుడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామ్మోహన్‌రావు (మోహన్‌బాబు) (72) మంగళవారం ఉదయం కారంచేడులో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఆయన అంత్యక్రియలు అభిమానులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య బుధవారం సాయంత్రం కారంచేడు హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. మోహన్‌బాబు మృతదేహానికి ఆయన మనుమడు వెంకటసాయి (చిన్నకుమార్తె స్వరూప కుమారుడు) అంత్యక్రియలు నిర్వహించాడు.

**అంత్యక్రియలకు హాజరైన వెంకటేష్, రాణా, నాగచైతన్య:**

మోహన్‌బాబు అంత్యక్రియల్లో సినీ అగ్రహీరోలు దగ్గుబాటి వెంకటేష్‌బాబు, దగ్గుబాటి రాణా, అక్కినేని నాగచైతన్య, దగ్గుబాటి అభిరామ్‌లు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చిన్నాన్న మృతదేహాన్ని చూసిన వెంకటేష్‌బాబు కన్నీరు పెట్టుకున్నారు. మంగళవారం నుంచి గ్రామంలోనే ఉన్న నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, మోహన్‌బాబు బావమర్ది, సినీ నటుడు కొల్లా అశోక్‌లు దగ్గరుండి అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలించారు. మోహన్‌బాబు పార్థివదేహంతో ప్రారంభమైన అంతిమ యాత్రలో దగ్గుబాటి వారి దేవర ఇంటి వరకు వెంకటేష్, రాణా, నాగచైతన్యలు పాడెను మోశారు. అయితే అప్పటికే అభిమానుల తాకిడి పెరగడంతో వారు వెనుతిరిగి ఇంటికి చేరుకున్నారు. మృతదేహానికి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు సందర్శించి నివాళులర్పించారు. మోహన్‌బాబుకు భార్య శారదాదేవి, కుమార్తెలు మాధవి, స్వరూప ఉన్నారు. అంత్యక్రియల్లో డాక్టర్ రామానాయుడు సతీమణి రాజేశ్వరి, కుమార్తె లక్ష్మి ఆమె కుటుంబ సభ్యులు, సురేష్‌బాబు భార్య లక్ష్మి, సినీ హీరో వెంకటేష్‌బాబు భార్య నీరజ, రానా భార్య మిహికా, మనుమళ్లు, మనుమరాళ్లతో పాటు సినీ నిర్మాతలు, గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

పొదిలి: పట్టణంలోని దాసరి గడ్డకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈత కొట్టేందుకు వెళ్లగా అందులో ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే..ఆరుగురు విద్యార్థులు జగనన్న లే అవుట్ సమీపంలో గుంతలోకి దిగారు. వారిలో ఐదుగురు గట్టుపైకి రాగా చెరుకూరి నాగార్జున అనే యువకుడు కనిపించలేదు. దీంతో మిగిలిన విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పోలీసులకు పిర్యాదు చేయటంతో ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వేళ చీకటిగా ఉండటంతో సహాయక చర్యలు నిలిపివేశారు. గురువారం ఉదయాన్నే సహాయక చర్యలు తిరిగి ప్రారంభిస్తామని ఎస్సై తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, స్పెషల్ టీమ్ గాలింపు కోసం వస్తున్నట్లు సమాచారం.



యువకుడు గల్లంతైన గుంత